జూ పార్క్ వద్ద రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి

విశాలాంధ్ర - సాగర్ నగర్: దసరా పండగ పూట తీవ్ర విషాదం చోటుచేసుకుంది. జూ పార్కు నుండి మధురవాడ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న తల్లీ కూతురు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో కుమార్తె నిషిత (20) అక్కడికక్కడే మృతి చెందగా తల్లి కాంచనకు స్వల్ప గాయాల య్యాయి. నిషిత నగరంలోని ఒక ప్రైవేట్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం అభ్యసిస్తున్నట్లు ఆరిలో ట్రాఫిక్ ఎస్ఐ శ్రీకాంత్ తెలియజేశారు. ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఘటన చోటు చేసుకుందని మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించినట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విశాఖ పోర్ట్‌ను సందర్శించిన ఆస్ట్రేలియన్ బృందం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఆస్ట్రేలియన్ కాన్సులేట్ డిప్యూటీ కాన్సుల్ జనరల్ మిస్టర్ డేవిడ్ ఎగుల్టన్, ఆస్ట్రేలియన్ హై కమీషన్ ఫస్ట్ సెక్రటరీ మిస్ గ్రేస్ విలియమ్స్ విశాఖపట్నం పోర్ట్‌ని శుక్రవారం సందర్శించారు. పోర్ట్ డిప్యూటీ చైర్మన్ దుర్గేశ్ కుమార్ దూబే ఆస్ట్రేలియన్ బృందానికి సాదర స్వాగతం పలికారు. విశాఖపట్నం పోర్ట్‌లో ఉన్న సౌకర్యాలు, పోర్ట్ అభివృద్ధికి చేపడుతున్న వ్యూహాత్మక కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డిప్యూటీ చైర్ పర్సన్ వివరించారు. భవిష్యత్తులో ఆస్ట్రేలియాతో వ్యాపార సంబంధాలకు అవసరమైన సహకారాన్ని అందజేస్తామని డిప్యూటీ చైర్ పర్సన్ తెలియజేశారు. ఆస్ట్రేలియా నుండి కుకింగ్ కోల్‌ను దిగుమతి చేసుకుంటున్నట్లు, విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం ఈ కోల్‌ని వినియోగిస్తున్నామని ఆయన వెల్లడించారు. భారత్‌కు కావలసిన కోల్ అవసరాలను తీర్చే అవకాశం కలిగినందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు ఆస్ట్రేలియా డిప్యూటీ కాన్సుల్ జనరల్ మిస్టర్ డేవిడ్ ఎగుల్టన్ తెలిపారు. విశాఖపట్నం పోర్ట్‌లో క్రూయిజ్ టెర్మినల్‌కు భారీ అవకాశాలు ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. విశాఖపట్నం పోర్ట్ అథారిటీ కార్యదర్శి టి. వేణుగోపాల్ ఈ సమాచారాన్ని మీడియాకు విడుదల చేశారు.

ప్రైవేట్ ట్రావెల్స్‌కు దండిగా డబ్బులు

దసరా పండగతో ఆర్టీసీ బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు ప్రయాణికులతో కిటకిట
ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రయాణం నరకమే....

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: దసరా పండగ ప్రైవేట్ ట్రావెల్స్‌కు దండిగా డబ్బులు తెచ్చిపెట్టాయి. పండక్కి సొంతూళ్లకు వెళ్లేందుకు సిద్ధమైన ప్రయాణికుల నుంచి కొన్ని ప్రైవేట్ ట్రావెల్స్ ఎడాపెడా దోచేస్తున్నాయి. సాధారణ ఛార్జీల స్థానంలో ఒక్కసారిగా అధిక ధరలు పెంచేశాయి. రైళ్లలో బెర్తులు ఖాళీ లేకపోవడం, ఆర్టీసీ బస్సుల్లో సీట్లు పరిమితంగా ఉండటంతో

ప్రయాణికులు ప్రైవేటు ట్రావెల్స్‌ను ఆశ్రయించక తప్పడం లేదు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్లు ప్రయాణికులతో కిటికిటలాడుతున్నాయి. శనివారం దసరా పండుగ, ఆదివారం సెలవు కావడంతో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు శుక్రవారం సొంతూళ్లకు వెళ్లారు. ఈ రెండు రోజుల్లోనే ట్రావెల్స్ సంస్థలు సొమ్ము చేసుకుంటున్నాయి. రాష్ట్రంలో 1,5 00 వరకు ట్రావెల్స్ బస్సులు ఉండగా, పేరున్న ప్రముఖ ప్రైవేటు సంస్థలే బాదుడులో పోటీ పడుతున్నాయి. సాధారణ రోజుల కంటే ఈ రెండు రోజుల్లో ఏసీ బస్సుల్లో సగటున ఒక్కో సీటుకు రూ.వెయ్యి, నాన్ ఏసీ బస్సుల్లో రూ.700 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. విజయవాడ నుంచి విశాఖపట్నానికి పలు ప్రైవేటు ట్రావెల్స్ ఏసీ బస్సుల్లో ఒక్కో బెర్త్‌కి రూ.2 వేల నుంచి రూ.2,500 వరకు వసూలు చేస్తున్నారు. విజయవాడ నుంచి కాకినాడకు రూ.1,500 నుంచి రూ.2 వేలు తీసుకుంటున్నారు. విజయవాడ నుంచి విశాఖకు ఆర్టీసీ ఏసీ ఇంద్ర సర్వీసుల సీటుకు రూ.905, అమరావతిలో రూ.1,120 కాగా, నాన్ ఏసీ లగ్జరీలో రూ.704 మాత్రమే ఆర్టీసీ చార్జీలు ఉన్నాయి. అయితే ప్రైవేటు ట్రావెల్స్ మాత్రం రెండు రెట్లు అదనంగా రేట్లు పెంచి ప్రయాణికుల జేబులకు చిల్లులు పెట్టాయి. సరిపడా ఆర్టీసీ బస్సులు లేకపోవడంతోనే

ప్రైవేటు ట్రావెల్స్‌ను ఆశ్రయించాల్సి వస్తుందని ప్రయాణికులు అంటున్నారు. మళ్లీ సంక్రాంతి వరకు స్వగ్రామాలకు రామని, దసరా పండగ కు సొంత ఊర్లకు వెళ్లాలని బయలుదేరితే ప్రయాణం చార్జీలు భారీగా వాచిపోయాయని అనేక మంది ప్రయాణికులు అభిప్రాయ పడుతున్నారు. విజయవాడ, రాజమండ్రి, కాకినాడ, నెల్లూరు, తిరుపతి, రాయలసీమ జిల్లాల నుండి ఉత్తరాంధ్ర జిల్లాలైన విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు, ఈ జిల్లాల్లో పలు ఊర్లకు వచ్చే ప్రయాణికులకు భారీగానే ప్రయాణం చార్జీలు రెట్టింపు అయ్యాయి. ఇక ముఖ్య పట్టణాలకు వెళ్లే సర్వీసుల్లో ఛార్జీల బాదుడు అధికంగా ఉంది. తిరుగు ప్రయాణంకు కూడా ప్రైవేట్ ట్రావెల్స్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. హైదరాబాద్, విజయవాడ వంటి నగరాలకు భారీగానే డిమాండ్ ఉంది. మొత్తానికి దసరా పండగ ట్రావెల్స్‌కు దండిగా డబ్బులు తెచ్చిపెట్టాయి. రవాణా శాఖ అధికారులు నామమాత్రంగానే తనిఖీలు నిర్వహించి దసరా కానుకలను దండుకోవడంలో నిమగ్నమయ్యారని పలువురు ప్రయాణికులు ఆరోపించారు.

13న అప్పన్న ఉద్యాన వనంలో శమీపూజ

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి స్వామివారి ఉద్యానవనంలో ఈనెల 13న శమీపూజ జరగనున్నట్లు ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, ఈఓ త్రినాథరావు తెలిపారు. చెడుపై మంచి విజయం సాధించడానికి గురుతుగా విజయదశమి పర్వదినాన కొండ కింద ఉద్యాన వనంలో శమీపూజను సంప్రదాయ బద్ధంగా జరిపించేందుకు ఈఈ రాంబాబు ఏర్పాట్లు చేస్తున్నారు. సింహాద్రి అప్పన్నస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి ఆదివారం సాయంత్రం ఒకచేతిలో విల్లంబు, మరో చేతిలో శరం ధరించి దుష్ట సంహారానికి వెళ్లే దారిలో శ్రీరాముడిగా దర్శనమివ్వనున్నారు. ఇందులో భాగంగా స్వామిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రభాత సేవలను యథావిధిగా జరిపి అనంతరం శమీపూజకు శ్రీకారం చుట్టి నృసింహ శమీ (జమ్మిచెట్టు) వృక్షానికి జలాలతో ప్రోక్షణ గావిస్తారు. అర్చకులు శమీవృక్షానికి పూజలు జరిపి జమ్మివేటను సంప్రదాయబద్ధంగా శమీవృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేసి పూజలు జరిపి శమీ పత్రాలను శిరస్సున దాల్చుతారు. జమ్మివేట దృష్ట్యా అప్పన్న పూదోట పరిసరాలను విద్యుద్దీపాలతో ఇప్పటికే అందంగా శోభాయమానంగా అలంకరణ చేశారు.

బీచ్‌లో మృతదేహం వెలికితీత

విశాలాంధ్ర - సాగర్ నగర్: జీవీఎంసీ పరిధిలోని అప్పుఘర్ బీచ్‌లో గుర్తుతెలియని మృతదేహాన్ని జీవీఎంసీ లైఫ్ గార్డ్స్ వెలికి తీసి పోలీసులకు అప్పజెప్పారని జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి తెలిపారు. శుక్రవారం విశాఖ అప్పుఘర్ బీచ్‌లో గుర్తు తెలియని మృతదేహం నీటిలో తేలియాడుతుండగా తెల్లవారు జామున 6 గంటలకు పవన్ కుమార్, బుజ్జి, నవీన్ అనే జీవీఎంసీ లైఫ్ గార్డ్స్ గుర్తించి వెలికి తీసి పోలీసులకు అప్పజెప్పారని అదనపు కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ విశాఖ సుందర నగరంలో సముద్ర తీర అందాలను తిలకించేందుకు జీవీఎంసీ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ప్రజల సందర్శనార్థమై కలిపిస్తోందన్నారు. సముద్ర తీర ప్రాంతంలో జీవీఎంసీ లైఫ్ గార్డులను ఏర్పాటు చేసి నిత్యం నిఘా ఉంచినప్పటికీ కూడా ప్రజలు, విహార, తీర్థయాత్రికులు ఆట విడుపుగా స్నానాలకు సముద్రంలోకి వెళ్లి తమ విలువైన ప్రాణాలను పోగొట్టుకుంటున్నారన్నారు.

చిత్రలేఖనం జన్మదిన ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

విశాలాంధ్ర - మల్కాపురం: విశాఖపట్నం రామకృష్ణా బీచ్ దరి పాండురంగాపురంలోని శ్రీ పాండురంగ స్వామి ఆలయ ప్రాంగణంలో తెలుగు సచిత్ర శిల్ప కార్టూన్ సమాచార ఏకైక మాసపత్రిక "చిత్రలేఖనం" (మొదటి జన్మదిన ప్రత్యేక సంచిక)ను ప్రముఖ రచయిత మేడా మస్తాన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సభకు కవులు, రచయితలు, చిత్రలేఖకులు, కళాకారులు హాజరై, పత్రికా ఎడిటర్ డి.ఎస్.మనోహర్‌కు ఆశీస్సులు, శుభాకాంక్షలు తెలియజేసారు. సుంకరి చలపతిరావు మాట్లాడుతూ చిత్రలేఖనమునకు ఆదరణ లేకపోవడం బాధాకరమని ఆవేదన వెలిబుచ్చారు. ముఖ్య అతిథి మేడా మస్తాన్ రెడ్డి ప్రసంగిస్తూ ముందుగా చిత్రలేఖనంను పాఠశాలల్లో ప్రవేశపెట్టాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్ చిన సూర్యనారాయణ, ఆర్టిస్ట్‌లు గణపతి రెడ్డి, ప్రభాకర్, నాగేశ్వరరావు, బుజ్జి, వి.వి.రమణ, యస్.జి.రాజు, కె.మహేష్, సన్యాసి రావు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: ఉక్కు నగరంలోని సీ భవన్‌లో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఆట, పాటలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేవిధంగా బతుకమ్మ పాటలతో ఆహూతులను అలరించారు. తొలుత స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) ఇన్‌చార్జి యు.శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉక్కులో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఉక్కు ఉద్యోగ కుటుంబాలు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా ఈ వేడుకలు ఉన్నాయని అన్నారు. సంఘం అధ్యక్షులు ఎస్.కుమార స్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్య క్రమంలో జనరల్ మేనేజర్‌లు రవి శేఖర్, ఆచారి, డా. నవీన్ కుమార్, ఎస్.వీరేశం, ప్రముఖ కాంట్రాక్టర్ ఏ.మురళీ ధర్ రెడ్డి, సంఘం ప్రధాన కార్యదర్శి జి.ఆనంద్, ప్రతినిధులు బి.వెంకటేశ్వర్లు, జి.మల్లేశం, ఎస్.నర్సింగరావు, ఎం.వేణు గోపాల్, టి.ప్రభాకర్, సి.హెచ్ రవి కుమార్, ఎం.చంద్ర శేఖర్, చంద్ర కిరణ్, ఎంకెవిఆర్ మోహన్‌రావు, సీ ప్రధాన కార్యదర్శి కె.వి.డి.ప్రసాద్, జాయింట్ సెక్రటరీ ఆర్.నరసింహ, బి.గణేష్ పాల్గొన్నారు.

స్వర్గీయ గుడివాడ గురునాధరావుకు ఘన నివాళులు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: స్వర్గీయ మాజీ మంత్రి గుడివాడ గురునాధరావు జయంతిని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వైసీపీ జిల్లా పార్టీ అధ్యక్షులు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని గురునాధరావు విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావు, నగర మేయర్ గొలగాని హరి వెంకట్ కుమారి, శాసనమండ సభ్యులు కుంభ రవిబాబు, వరుదు కళ్యాణి, మాజీ శాసనసభ్యులు తైనాల విజయ్ కుమార్ ,తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్ కుమార్, చింతలపూడి వెంకట రామయ్య, తిప్పల గురుమూర్తి రెడ్డి, పార్టీ కార్యాలయం ఇన్‌ఛార్జ్ రవి రెడ్డి, నియోజకవర్గ పరిశీలికులు బాణాల శ్రీనివాసరావు, మొల్లి అప్పారావు, తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి, రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులు జాన్ వెస్లీ, పేర్లే విజయ్ చంద్ర, రాష్ట్ర అనుబంధ విభాగాల ఉపాధ్యక్షులు ద్రోణంరాజు శ్రీవాత్సవ్, కాళిదాస్ రెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గిరిబాబు, పార్టీ ముఖ్య నాయకులు బొడ్డేటి ప్రసాద్, డాక్టర్ జహీర్ అహ్మద్, చెన్న దాస్, చిక్కాల రామారావు, జెడ్పీటీసీ దొండ రాంబాబు, కార్పొరేటర్లు రేయ్ వెంకటరమణ, బిపిన్ కుమార్ జైన్, పివి సురేష్, మహమ్మద్ ఇమ్రాన్, కో ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, ఎండి షరీఫ్, జోన్లు ఇన్చార్జిలు అల్లంపల్లి రాజాబాబు, బలిరెడ్డి పద్మావతి, జిల్లా అనుబంధ విభాగ అధ్యక్షులు బోని శివరామకృష్ణ, బొండా ఉమామహేశ్వ రరావు, రాయిపురెడ్డి అనిల్, పార్టీ నాయకులు జీలకర్ర నాగేంద్ర, పల్లా దుర్గ, దొడ్డి కిరణ్, బాబు ఆనంద్, పాత్రుడు, పీవీ నారాయణ, కనక రెడ్డి, అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్వి పాలెంలో అన్న సమారాధన

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని లోడగలవానిపాలెం పంచాయతీ పరిధిలో శ్రీ దుర్గామాత నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 3 వేలు మందికి పైగా భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారని స్థానిక సర్పంచ్ లోడగల రాజేశ్వరి రమణ తెలిపారు. కార్యక్రమంలో భీమిలి టిడిపి ఇన్చార్జ్ కోరాడ రాజబాబు, బమ్మిడి తారక్, వెంకటరావు, నవీన్ జ్ఞానేశ్వర్, లోడగల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రంగోలితో మానసిక ఆరోగ్యంపై అవగాహన
గీతం విద్యార్థుల వినూత్న ప్రయోగం

విశాలాంధ్ర - మధురవాడ: వివిధ రకాల రంగులు అవి మనస్సుపై చూపే ప్రభావం అందరికీ తెలిసిందే. అయితే దీనిని వినూత్నంగా చెప్పడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ మానసిక శాస్త్ర విభాగం విద్యార్థులు తమదైన శైలిలో తెలియజెప్పారు.

ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా శుక్రవారం జరిగిన రంగోలి కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మనిషి జీవితానికి మానసిక ఆరోగ్యం ఎంత అవసరమో వివిధ రకాల రంగులతో తీర్చిదిద్దిన రంగవల్లికల ద్వారా చెప్పే ప్రయత్నం చేశారు. పండగ రోజులు కావడంతో విద్యార్థులు మానసిక ఆరోగ్య ప్రాధాన్యతను తెలియజేయడానికి రంగోలి కార్యక్రమాన్ని ఎంచుకున్నారు. విద్యార్థుల వినూత్న ప్రయత్నాన్ని ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు అభినందించారు.

నడుపూరులో దేవీ నవరాత్రి ఉత్సవాలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: నడుపూరులో కృష్ణదేవరాయ యూత్ ఆధ్వర్యంలో రామాలయ ప్రాంగణంలో జరుగుతున్న నవరాత్రుల మహోత్సవంలో మహిషాసుర మర్దిని అవతారంలో అమ్మవారు దర్శనం ఇచ్చారు. దుర్గాదేవిని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, ఏపీ తెలంగాణ స్టేట్ ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్, ఉక్కు పోరాట కమిటీ సభ్యులు జెర్రిపోతుల ముత్యాలు, కృష్ణదేవరాయ యూత్ సభ్యులు ఇందల సంతోష్, తలారి లక్ష్మణ్, షణ్ముఖ, మనోజ్, సాయి దర్శించుకున్నారు.

విశాఖకు అంతర్జాతీయ గుర్తింపు

టీసీఎస్ క్యాంపస్ తెచ్చిన లోకేష్‌కు గంటా అభినందనలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: అంతర్జాతీయ స్థాయిలో విశాఖపట్టణానికి గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తున్న ఐటీ మంత్రి నారా లోకేష్‌కు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అభినందనలు తెలియజేశారు. శుక్రవారం తాడేపల్లిలో లోకేష్‌ను కలిసిన గంటా భీమిలి అభివృద్ధి గురించి చర్చించారు. టీసీఎస్ క్యాంపస్ ఏర్పాటు ద్వారా 10 వేల ఉద్యోగాలు రావడానికి లోకేష్ చూపించిన చొరవను ఇక్కడి ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని గంటా పేర్కొన్నారు. ఐటీతోపాటు టూరిజం, ఫార్మా, విద్యా రంగాల అభివృద్ధికి ఉద్దేశించిన ప్రతిపాదనల గురించి ప్రస్తావించారు. సువిశాలమైన బీచ్ రోడ్‌ను వివిధ జోన్లుగా అభివృద్ధి చేస్తే వేలాది మంది స్థానికులకు ఉపాధి కలుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి విశాఖ గ్రోత్ ఇంజన్‌లా ఉపకరిస్తుందన్నారు. భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు సిద్ధమయ్యే నాటికి ఎలివేటెడ్ కారిడార్లు, ఫ్లై ఓవర్లు వంటి సమాంతర మౌలిక సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడంతోపాటు ట్రాఫిక్ సమస్యలు అధిగమించేలా ప్రణాళికలు సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని లోకేష్ దృష్టికి గంటా తీసుకువెళ్లారు. మెట్రో ఏర్పాటుతో విశాఖ పరిసరాలు శరవేగంగా అభివృద్ధి చెందడానికి అవకాశముంటుందని, సాధ్యమైనంత త్వరగా ఆ ప్రాజెక్టు కార్యరూపం దాల్చేలా చూడాలని కోరారు. ఆర్థిక రాజధాని విశాఖ ప్రాముఖ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తరచూ వస్తుంటానని, మరిన్ని పరిశ్రమలు వచ్చేలా చూస్తానని లోకేష్ తెలిపారు. విశాఖను దేశంలోకి టాప్ 5 నగరాల్లో ఒకటిగా నిలబెట్టేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. వచ్చే నెల నుంచి ఇసుక పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందని, ఎలాంటి కొరత లేకుండా చూస్తామని గంటాకు లోకేష్ హామీ ఇచ్చారు.

ప్రజల ఆరోగ్యంతో చెలగాటమా...!

జీఎంపి సీ ఫుడ్ కంపెనీ కాలుష్యం అరికట్టాలి
సిపిఎం ఆధ్వర్యంలో మహా ధర్నా

విశాలాంధ్ర - ఆనందపురం: ప్రజల ఆరోగ్యాలతో ఫ్యాక్టరీ యాజమాన్యం చెలగాటమాడడం సమంజసం కాదని సీపీఎం నాయకులు తెలిపారు. సీ ఫుడ్ కంపెనీ వలన దాని నుంచి వచ్చే వ్యర్థపు నీరుతో దుర్వాసన వస్తోందని, అలాగే ఇక్కడ కంపెనీ ఉండడం వల్ల భూగర్భ జలవనరులు పూర్తిగా కలుషితం అవుతున్నాయని వెంటనే కంపెనీని తొలగించి గ్రామ ప్రజలకు విముక్తి కల్పించాలని కోరారు. మండలంలో బాకురుపాలెం పంచాయితీ, కుశులువాడ పంచాయితీ చిన్నయ్య పాలెం గ్రామాల నడుమ ఉన్న ఘూన్ మెరైన్ ప్రొడక్ట్ (జీఎంపి)సి ఫుడ్ కంపెనీ వద్ద శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కంపెనీ నుండి విడుదల చేసే వ్యర్థ నీరు వలన అనారోగ్యం పాలవుతున్నామని చిన్నయ్యపాలెం గ్రామస్తులు కంపెనీ గేటు ముందు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ముందుగా చిన్నయపాలెం గ్రామం నుండి బాకురుపాలెం జి.ఎం.పి కంపెనీ వద్దకు చేరుకొని గ్రామస్తులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు, జీవీఎంసీ 78వ కార్పొరేటర్ కామ్రేడ్ బి.గంగారావు మాట్లాడుతూ సీ ఫుడ్ కంపెనీ విడుదల చేసే వ్యర్థ నీరు కాలువల ద్వారా బయటకు

వదిలివేస్తున్నారని, చిన్నయపాలెం పరిసర ప్రాంతాలలో దుర్వాసనతో కూడిన నీరు రావడం వలన దోమలు వృద్ధి చెంది గ్రామస్తులు పలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కాలవల్లో నీరు తాగడం వలన పశువులు అనారోగ్యం పాలవుతున్నాయన్నారు. కంపెనీలు ఏర్పాటు చేసే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యర్థపు నీరును బయటకు పంపించకుండా కంపెనీలోనే ఫిల్టర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల ఆరోగ్యాలకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించరాదని, కాలుష్యం నివారణ చర్యలు చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. సిపిఎం జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ సీ ఫుడ్ కంపెనీలు సముద్రాల పక్కన పెట్టుకోవాలని

అటువంటిది గ్రామాల మధ్య పెట్టి పర్యావరణానికి హాని కలిగించే విధంగా ప్రవర్తించడం సరికాదన్నారు. గ్రామాల నడుమ ఇటువంటి కంపెనీలకు అనుమతి ఇవ్వరాదని పొల్యూషన్ డిపార్ట్మెంట్ ఏ రకంగా అనుమతి ఇచ్చిందని విమర్శించారు. ఇప్పటికైనా కాలుష్య నివారణ చర్యలు చేపట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. ఈ సందర్భంగా కంపెనీ యాజమాన్యం కృష్ణారావు ప్రజల ముందుకు వచ్చి కంపెనీ నుండి వచ్చే కాలుష్యాన్ని నివారణ చర్యలు చేపడతామని చెప్పడంతో ఆందోళన విరమించారు. పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కంపెనీ ఎండి కృష్ణారావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రవ్వ నర్సింగరావు, చిన్నయ్యపాలెం గ్రామస్తులు భీమారాజు, నూకరత్నం, కొప్పల దాలప్ప, కదరాశి అర్జున, గ్రామ పెద్దలు మహిళలు పాల్గొన్నారు.

స్నేహితురాలికి చేదోడు

వైద్య ఖర్చుల నిమిత్తం 40 వేలు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - నక్కపల్లి: 2001 పదవ తరగతికి చెందిన విద్యార్థులు తన స్నేహితురాలు కష్టాల్లో ఉందని భావించి ఒకరికి ఒకరు సాయంగా కలిసి ఆమెకు 40 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు. మండలంలో ఉపమాక గ్రామానికి చెందిన భార్గవికి రోడ్డుప్రమాదంలో బలమైన గాయం తగలడంతో కాకినాడ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తన సొంత గ్రామానికి వచ్చిన భార్గవికి తన స్నేహితులు అండగా ఉంటూ ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం 40 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పిక్కి కోదండ అప్పలరాజు తదితరులు మాట్లాడుతూ తన తోటి స్నేహితులకు ఎటువంటి కష్టం వచ్చినా వారికి అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కొత్త సందీప్, గోవిందు, కరి రమేష్, పైడయ్య చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న గొర్లె

విశాలాంధ్ర - పెందుర్తి: మండలంలోని కరకవానిపాలెంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గ్రామంలో అమ్మవారి ప్రతిమను నెలకొల్పిన నిర్వాహకులు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనం కలిగిస్తున్నారు. భారతీయ జనతాపార్టీ పెందుర్తి నియోజకవర్గం కన్వీనరు గొర్లె రామునాయుడు శుక్రవారం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. భవానీమాల ధరించిన రామునాయుడు పలువురు భక్తులతో కలిసి మహిశాసుర మర్ధిని రూపంలో గల అమ్మవారి సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాము నాయుడు మాట్లాడుతూ దుర్గమ్మ ఆశీస్సులు పెందుర్తి నియోజకవర్గం ప్రజలందరిపైనా ఉండాలని ఆకాంక్షించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటిన గాయిత్రీ విద్యార్థులు

విశాలాంధ్ర - పెందుర్తి: విశాఖ జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో నగరంలోని గాయత్రీ విద్యా పరిషత్ ఎం.ఎల్.బి.టి పాఠశాల ఐదో తరగతి విద్యార్థిని ప్రీ వర్షిని జాతీయస్థాయికి ఎంపికైందని పాఠశాల ప్రిన్సిపల్ వేదుల మధురవాణి తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 31 నవంబర్ ఒకటో తేదీలలో హైదరాబాద్‌లో జరుగనున్నాయి. మన రాష్ట్రం తరపున ఇప్పటికే వర్షిని, ఆమె సోదరుడు మూడో తరగతి చదువుతున్న నియాన్ కూడా ఎంపికయ్యాడని, ప్రియ వర్షిని బంగారు పతకాలతో అందరికంటే ముందంజలో ఉందని ఆమె తెలియజేశారు.

మహిషాసుర మర్ధిని అవతారంలో శ్రీ కనక దుర్గ మాత

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ ఆవరణలో వేంచేసియున్న శ్రీ కనకదుర్గమ్మ దేవాలయంలో శరన్న వరాత్రుల్లో భాగంగా తొమ్మిదవ రోజు శుక్రవారం మహిషాసుర మర్ధిని అవతారంలో శ్రీ కనకదుర్గ దర్శనమిచ్చారు. శుక్రవారం వేకువజాము నుండి అమ్మవారికి శ్రీ సూక్త విధానంలో పంచామృతములతో అభిషేకం, పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు, సహస్ర ఫలాలతో అమ్మవారు అలంకరణలో మహిళలు, భక్తులచే పూజలు అనంతరం మహిషాసుర మర్ధిని హోమం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు పి.శివ కుమార్ శర్మ తెలిపారు. చుట్టుపక్కల గ్రామాలు, పట్టణాలు నుండి భక్తులు ఇక్కడకు విచ్చేసి అమ్మవారికి మొక్కులు తీర్చుకుని, దుర్గాదేవిని దర్శించుకోవడం, భవాని దీక్షలు చేపట్టడం ఇక్కడి ప్రజలు నమ్మకం. దుర్గ దేవి దర్శనంకు వచ్చెడి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు మోటార్ వర్కర్స్ యూనియన్ కమిటీ తెలియజేసారు. చుట్టుపక్కల దామునా పల్లి, మైచర్లపాలెం, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో దుర్గాదేవి విగ్రహాలు విరివిగా నెలకొల్పి, దీక్షాపరులైన భవాని భక్తులచే శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు.

చండీ హోమంలో ఎమ్మెల్యే గణబాబు

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం 60వ వార్డులో అంగ పద్మ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ దుర్గా దేవి నవరాత్రులు మహోత్సవాల సందర్భంగా శుక్రవారం చండీ హోమం కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు గణబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులతోపాటు భవాని భక్తులకు పాల్గొన్నారు.

షిప్‌యార్డులో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - మల్కాపురం: పరిశ్రమల్లో ఒకటైన షిప్ యార్డ్‌లో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. టిఎన్టియుసి అధ్యక్షులు, సెక్రటరీ, ఆఫీస్ బేరర్స్ దుర్గాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్మికులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిముక్కులో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

విశాలాంధ్ర - పెడగంట్యాడ: పెడగంట్యాడ నెల్లిమక్కు గ్రామంలో శ్రీ దేవీ శరన్నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారు సింహ వాహనాన్ని అధిష్టించి ఆయుధాలను ధరించిన చండీ సకల దేవతల అంశలతో మహాశక్తి స్వరూపంగా దర్శనమిస్తుందని, ఈ తల్లిని పూజిస్తే సకల దేవతల అనుగ్రహం కలుగుతుందని నమ్మకం. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, దొడ్డి పెద్దలు, కమిటీ సభ్యులు ప్రజా నాయకులు పాల్గొన్నారు.

కరకవానిపాలెంలో అన్నసమారాధన

విశాలాంధ్ర - పెందుర్తి: మండలం గొరపల్లి పంచాయతీ కరక వానిపాలెం గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గ్రామ పెద్దలు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్సవాలలో భాగంగా శుక్రవారం నిర్వహించిన భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని మాజీ శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ ప్రారంభించి భక్తులకు ప్రసాద వితరణ చేసారు. అంతకు ముందు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. కార్యక్రమంలో పెందుర్తి ఎంపీపీ మధుపడ నాగమణి అంజి, పెందుర్తి వైస్ ఎంపీపీ చిరికి దేవుడు, పెందుర్తి మండల పార్టీ అధ్యక్షులు గొరపల్లి శ్రీను, గవరపాలెం సర్పంచ్ కోయిలాడ శ్రీను, వైసిపి నాయకులు చిరికి అవతారం, దారపు రెడ్డి పోతన్న, చిరికి అప్పారావు, కరక కృష్ణంరాజు, దారపు రెడ్డి సన్నీ బాబు, చిరికి సూర్యనారాయణ, దారపు రెడ్డి నాయుడు, పోతల కిషోర్, పోతల జగదీష్, ఎల్ అశోక్, బోకం శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీకేయం నుంచి అర్బన్ క్రూయిజర్ హైరైడర్ 'ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్

విశాలాంధ్ర - విశాఖపట్నం: టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) ఈ రోజు అర్బన్ క్రూయిజర్ హైరైడర్ 'ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్'ని పరిచయం చేసింది. ఈ సందర్భంగా టికేయం సేల్స్ సర్వీస్ యూజ్డ్ కార్ విభాగ ప్రతినిధి శబరి మనోహర్ మాట్లాడుతూ ఇందులో ప్రత్యేకమైన టొయోటా జెన్యూన్ యాక్సెసరీస్ (టిజిఎ) ప్యాకేజ్‌లు ఉన్నాయన్నారు. 2022లో విడుదల అయినప్పటి నుండి, అర్బన్ క్రూయిజర్ హైరైడర్ దాని అత్యాధునిక సాంకేతికత, డైనమిక్ పనితీరు అత్యుత్తమ ఇంధన సామర్థ్యంతో దేశవ్యాప్తంగా వినియోగ దారుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందన్నారు. టొయోటా కిర్లోస్కర్ మోటార్ 20 22లో విడుదల చేసినప్పటి నుండి అర్బన్ క్రూయిజర్ హైరైడర్ స్థిరమైన మొబిలిటీని అందించడంలో టికెఎం యొక్క నిబద్ధతకు చిహ్నంగా ఉందన్నారు.

8వ వార్డులో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - సాగర్ నగర్: జీవీఎంసీ 8వ వార్డ్ పరిధిలో ఎండాడ దుర్గాదేవి నవరాత్రులు సందర్భంగా శుక్రవారం మహిషాసురుని అవతారంలో దుర్గాదేవిని అలంకరించారు. జనసేన పార్టీ అధ్యక్షుడు శేఖర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం కుంకుమ అర్చనలు, అమ్మవారికి అలంకరణతో భక్తిశ్రద్ధలతో పూజించారు. అనంతరం మధ్యాహ్నం అన్న సమారాధన జరిపించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర - మల్కాపురం: దేవి నవరాత్రుల సందర్భంగా శుక్రవారం చింతల పూడి శివ కుమార్ ఆధ్వర్యంలో పద్మ శాలి వీధిలో నిర్వహిస్తున్న దేవి నవరాత్రుల్లో భాగంగా విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ముఖ్య అతిధిగా టీడీపీ, 61వ వార్డ్ అధ్యక్షులు మజ్జి సోమేశ్, సంధ్య దంపతుల చేతులు మీదుగా ప్రాణ ప్రతిష్ట చేశారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి సత్యనారాయణ దంపతులు తదితరులు పాల్గొన్నారు.

29వ వార్డులో అన్నసమారాధన

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 29వ వార్డు కలెక్టర్ ఆఫీసు దగ్గర శ్రీ రావి దుర్గా గణపతి సాయి షణ్ముఖ ప్రసన్నాంజనేయ ఆటోస్టాండ్ వారి ఆధ్వర్యంలో, ఆంథోనీ నగర్ ప్రాంత మహిళలు ఆధ్వర్యంలో అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. మన్యాల శ్రీనివాస్ దుర్గాదేవి అమ్మవారికి విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించి అనంతరం భక్త కోటికి అన్నసమారాధన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మన్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపం అని, శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు శ్రీ మహిషాసురమర్దిని దేవిగా దర్శనం ఇస్తూ భక్తులందరికీ దర్శనమిస్తూ, శ్రీ అమ్మవారు భక్త జనులందరికీ ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులను ప్రసాదించి చల్లగా చూడాలని ఆకాంక్షించారు. అన్ని దానాలలో అన్నదానం చాలా గొప్పదని, శ్రేష్టమైనదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వార్డు అధ్యక్షులు డి.శేఖర్ పాల్గొన్నారు.

అవయవదానంతో ఐదుగురు జీవితాల్లో వెలుగు

బ్రెయిన్‌డెడ్ అయిన నరేష్ (ఫైల్‌ఫొటో)

విశాలాంధ్ర - విశాఖపట్నం: తాను చనిపోతూ మరో ఐదుగురు ప్రాణాలు కాపాడారు ఒడిశాకు చెందిన వ్యక్తి. జీవన్ దాన్ కోఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కే.రాంబాబు తెలిపిన వివరాలు ప్రకారం ఈ నెల 09వ తేదీన ఒడిశా పర్లకిమిడి జిల్లాకు చెందిన నరేష్ పట్నాయక్ (32) పొద్దునే ఇంట్లో స్పృహ కోల్పోయారు. దీంతో కుటుంబ సభ్యులు దగ్గర్లో ఉన్న ఆసుపత్రికి తరలించగా బ్రెయిన్‌లో తీవ్ర రక్తస్రావం అవుతున్నట్టు తెలుసుకొన్న వైద్యులు ఎంతగానో శ్రమించినా ఫలితం లేదన్నారు. శుక్రవారం బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించి, ఆ తర్వాత అవయవదానంపై వైద్య బృందం వారి కుటుంబ సభ్యులు భార్య, కుమారుడు, కుమార్తె, బంధు వులకు అవగాహన కల్పించారన్నారు. కుటుంబ సభ్యులు అంగీకారం తెలపడంతో నరేష్ పట్నాయక్ శరీరంలో పనిచేస్తున్న ఊపిరితిత్తులు, గుండె, కిడ్నీలు, లివర్ అవయవాలను సేకరించి, జీవన్ దాన్ ప్రోటోకాల్ ప్రకారం ఐదుగురుకు కేటాయించామన్నారు. అవయవ దానం చేసేం దుకు ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. అలాగే విజయవంతంగా అవయవాలను సేకరించి తరలించిన వైద్య బృందానికి, గ్రీన్ ఛానల్ ద్వారా అవయవాలు వేగంగా చేరేందుకు సహకరించిన నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చికు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు
– డాక్టర్ కే.రాంబాబు, రాష్ట్ర కోఆర్డినేటర్, జీవన్ దాన్

అవయవ దానంపై రాష్ట్రవ్యాప్తంగా అనేక అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడం జరుగుతుంది. అందువల్లనే ఈ మధ్యకాలంలో అవయవాలు దానం చేసేందుకు బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి కుటుంబ సభ్యులు ముందుకు వస్తున్నారు. అవయవాల కోసం రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో రోగులు ఎదురుచూస్తున్నారు. ఇలా అవయవ దానం చేసేం దుకు ముందుకు రావడం ద్వారా వారి జీవితాల్లో నూతన వెలుగులను నింపిన వాళ్లమవుతాం. అవయవ దానంపై ఉన్న అపోహలను వీడి అవయవాల కోసం ఎదురుచూస్తున్నటువంటి వారికి అండగా నిలవాలి.

దుర్గమ్మ సేవలో మేయర్ గొలగాని దంపతులు

విశాలాంధ్ర - పీఎం పాలెం: విజయదుర్గాదేవి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీ విజయ దుర్గాదేవి తొమ్మిదవ రోజు శ్రీ మహిషాసుర మర్దిని దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్తలు బంగారు సుబ్బారావు, లక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో ప్రధానార్చకులు శ్రీకాంత్ శర్మ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో భారీ మహా అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేయర్ దంపతులు గొలగాని హరివెంకట కుమారి, శ్రీనివాసరావు దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ అమ్మవారి తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందజేసి దంపతులను శాలువతో సన్మానించారు. అనంతరం మేయర్ హరివెంకట కుమారి చేతుల మీదుగా భక్తులకు ప్రసాద వితరణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు బంగారు ప్రకాష్, బంగారు అశోక్ కుమార్, బంగారు ఝాన్సీ, తెంటు మాధవి, వట్టికుల నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేష్ కృషితోనే పరిశ్రమలు ఏర్పాటు

విశాలాంధ్ర - అనకాపల్లి: రాష్ట్రంలో నాలుగు నెలల పాలనలో జగన్ రెడ్డి అతలాకుతలం చేసి పోయిన రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మళ్లీ గాడిలో పెడుతున్నారని మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రాన్ని గతంలో విడిచిపెట్టి పోయిన పారిశ్రామికవేత్తలను తిరిగి రప్పించడానికి చంద్రబాబు, లోకేష్ శక్తియుక్తులన్నీ వాడి వారిని తిరిగి రప్పించి పారిశ్రా మిక వేత్తలతో సమీక్ష సమావేశాలు పెట్టి వారి వారికి భరోసా కల్పించి 26 జిల్లాల్లో ఐదు సంవత్సరాలు కాలంలో 20 లక్షలు ఉద్యోగాలు కల్పించే విధంగా చంద్రబాబు చర్యల మూలంగా పారిశ్రామిక వేత్తలు నమ్మకంతో సుమారు 16 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టడానికి సుముఖం చూపించారని, జగన్ రెడ్డి నాడు 14 లక్షల కోట్లు అప్పులు తెచ్చిప్రజలకు తిప్పలు చూపించారని, కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో కేంద్రంలో ఉండడం వల్ల వారి సహకారంతో రాష్ట్రానికి నిధులు, పరిశ్రమలు రావడానికి సహకారం అందిస్తున్నారని నాగ జగదీష్ అన్నారు. మరోపక్క జగన్ రెడ్డి వారి పేటీఎం బ్యాచ్ నీలి మీడియా కూలి మీడియా పారిశ్రామిక వేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడితే మీరు ఉద్యోగాలు ఇచ్చే మహిళలకు రక్షణ ఉండదని బెదిరిస్తున్నారని, ఇటువంటి నీచి కెమిలీ కుత్తే నా కొడుకులను చట్టపరంగా గుర్తించి రాష్ట్ర ద్రోహులుగా కఠినమైన శిక్షలు బడే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి నాగ జగదీష్ విజ్ఞప్తి చేశారు. అమరావతిలో డిసెంబర్ నుండి 150 సంస్థలు ప్రైవేటు ప్రభుత్వ రంగ సంస్థలు నిర్మాణాలు చేపట్టడానికి ముందుకు వచ్చారని అలాగే ప్రభుత్వ భవనాలు, 90 శాతం నిర్మాణాలు పూర్తయిన వాటిని పూర్తి చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని పోలవరం మొదటి దశ పూర్తి చేయడానికి కేంద్రం12,500 కోట్లు మంజూరు చేశారని, ఇక అన్ని జిల్లాల్లో వివిధ రకాల పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారని, ఆయా ప్రాంతాల నిరుద్యోగ యువతీ యువకులకు కార్మికులకు ఉపాధి అవకాశాలు వచ్చే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని నాగ జగదీష్ అన్నారు. కూటమి ప్రభుత్వం రాగల నాలుగేళ్ల ఎనిమిది నెలల కాలంలో ఆంధ్రప్రదేశ్ ను దేశంలోనే ఒక మంచి స్థానంలో నిలబెడుతుందనడంలో అతిశయోక్తి లేదని నాగ జగదీష్ అన్నారు.

శారదా పీఠం అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: శారదా పీఠంలో జరుగుతున్న అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ కోరారు. శుక్రవారం వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ శారదా పీఠంపై తీవ్రమైన ఆరోపణలు చేశారు. శారదా పీఠం కార్యకలాపాలలో సింహాచలం దేవస్థానంలో ఉద్యోగిగా పనిచేస్తున్న రమణమూర్తి అనే వ్యక్తి అత్యంత కీలకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిం చారు. శారదా పీఠం పేరుతో ఎస్.ఎన్.పాల్ చేస్తున్న అక్రమాల పై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని బి.వి.రామ్ విజ్ఞప్తి చేశారు. మరోవైపు శారదా పీఠాధిపతినని, హిందూ మత ఉద్ధరణకు పాటుపడతానని చెబుతూ ప్రజలను మోసం చేస్తున్న ఎస్.ఎన్.పాల్ (స్వరూపానందేంద్ర సరస్వతి) ప్రతిష్ట ఉభయ తెలుగు రాష్ట్రాలలోనూ క్రమ క్రమంగా దిగజారిందన్నారు. శారదా పీఠానికి నిధుల ప్రవాహం ఆగిపోయింది అన్నారు. ఈ నేపథ్యంలో దేవీ నవరాత్రులను మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు అన్నారు. మాజీ మంత్రి దివంగత గుడివాడ గురునాథరావు 69వ జయంతి సందర్భంగా ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఆయన విగ్రహానికి తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ పూల మాల వేసి నివాళులు అర్పించారు. విలేకరుల సమావేశంలో డాక్టర్ పఫూర్ నికుంజ్, కోరుకొండ శ్రీనివాసరావు, జి.విజయ రమణి తదితరులు పాల్గొన్నారు.

20న ప్రజా కవి "గద్దర్"కు గేయ నీరాజనాలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ప్రజాయుద్ధనౌక, ప్రజా కవి, గాయకుడు గద్దర్ అన్నకు నివాళులర్పిస్తూ ఈ నెల 20న ద్వారక నగర్ పౌర గ్రంథాలయంలో మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 7 వరకు "ప్రజా యుద్ధనౌక గద్దర్ అన్న యాదిలో" పేరున గొప్ప కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ తెలిపారు. బహుజన కళా మండలి నిర్వాహకులు చౌటుపల్లి శేషుతో కలిసి ప్రచార పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని తెలియ జేశారు. గద్దర్ ప్రజా సాహిత్యం ఈ సమాజం ఉన్నంతకాలం సజీవంగా ఉంటుందని దేవిశ్రీ అన్నారు. గొప్ప పాటలు రాసిన చరిత్ర గద్దర్ నేపథ్యం అనేక కళాబృందాలు ద్వారా గద్దర్ గొప్పతనాన్ని, సాహిత్యాన్ని జనంలోకి తీసుకెళ్లడంలో ముందున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గద్దర్ కుమార్తె వెన్నెల గద్దర్ హాజరవుతారని తెలియజేశారు. గద్దర్ పాట వినని వారంటూ ఉండరని అటువంటి ప్రజా యుద్ధ నౌక గద్దర్‌ని ఒకరోజు స్మరించుకునే కార్యక్రమానికి అందరూ రావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనేక కళా సంఘాలు, సంస్థలు ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొం టారని పేర్కొన్నారు. ప్రజా కళా మండలి, ప్రజానాట్యమండలి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, ప్రజా ఉద్యమ అమర కళాకారుల వేదిక, జన చైతన్య మండలి, విశ్వజన కళా మండలి, ఉత్తరాంధ్ర సంగీత జానపద కళా పీఠం, పర్యావరణ కళామండలి, బహుజన కళా మండలి వివిధ సంస్థలు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నడవబడుతుందని ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ తెలియజేశారు.

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు: ప్రజలు బేజారు...!

విశాలాంధ్ర - గొలుగొండ: కాలువల్లో చెత్తాచెదారం తొలగించక పోవడంతో మురుగు నీరు అంతా వీధి రోడ్లపైన ప్రవహించడంతో ప్రజలు వివిధ రోగాల బారిన పడి తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని ఏఎల్ పురం ఎంపీటీసీ -2 రుత్తల శివరామకృష్ణ అన్నారు. మండలంలో మేజర్ పంచాయతీ ఏఎల్ పురం గ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లే రహదారిలో చిన్నపాటి వర్షం కురిసినా కాలువల్లో చెత్త తొలగించక పోవడంతో రోడ్లపైనే మురుగునీరు ప్రవహిస్తుందన్నారు. ఈ విషయమై పంచాయతీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ స్పందించక పోవడం శోచనీయమన్నారు. ప్రజా ప్రతినిధిగా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీల్లో పూడికలు తొలగించి రోడ్లపై మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారని ఎంపీటీసీ రామకృష్ణ అన్నారు.